క్లుప్తంగా

ఆన్‌లైన్ కోర్సుల రద్దుకు డిమాండ్



నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నేతలు

తిరుపతి సిటీ : ఎస్వీయూలో పీజీ విద్యార్థులపై రుద్దిన సెల్ఫ్ ఆన్‌లైన్ కోర్సులను తక్షణమే రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం వర్సిటీలోని ప్రకాశం భవనం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఎస్ఎఫ్ఐ రాష్ట్ర యూనివర్సిటీల కో –కన్వీనర్ అశోక్ కుమార్, యూనివర్సిటీ కార్యదర్శి వినోద్ మాట్లాడుతూ సెల్ఫ్ కోర్సుల ముసుగులో ప్రతి సెమిస్టర్‌కు ఒక్కో విద్యార్థి నుంచి ఒక్కో కోర్సుకి రూ.వెయ్యి నుంచి రూ.4వేలు బలవంతంగా వసూలు చేయడం దారుణమన్నారు. ఆన్‌లైన్ కోర్సులను రద్దు చేయకుంటే ఈనెల 22వ తేదీన వర్సిటీ పరిపాలనా భవనాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. నేతలు విజయ్, మల్లికార్జున, చక్రి, అనిల్ పాల్గొన్నారు.

అవసరం.. వేదాధ్యయనం



జ్యోతి ప్రజ్వలనలో అతిథులు

తిరుపతి తుడా : జీవనశైలిని మెరుగుపరుచుకునేందుకు వేదాల అధ్యయనం అవసరమని స్విమ్స్ డైరెక్టర్, వీసీ డాక్టర్ ఆర్వీ కుమార్ తెలిపారు. శుక్రవారం పద్మావతి ఆడిటోరియంలో నిర్వహించిన వేదిక్ సైన్స్ ఇన్ మోడ్రన్ అప్లికేషన్స్ అనే అంశంపై ఆయన ప్రసంగించారు. ముందుగా అతిథులతో కలసి జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. స్విమ్స్ డైరెక్టర్ మాట్లాడుతూ వేద జ్ఞానంతో ఒత్తిడిని జయించవచ్చన్నారు. అనంతరం జర్మనీకి చెందిన ఎనర్జీ సైంటిస్ట్ డాక్టర్ దారా ఎస్ గుప్తా నామ్ మాట్లాడుతూ ధ్యానం, యోగా ఏకాగ్రతను పెంపొందిస్తాయని పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

శానంబట్లలో ఇసుక దోపిడీ

చంద్రగిరి : మండలంలోని శానంబట్ల వద్ద స్వర్ణముఖి నదిలో ఇసుక దోపిడీ యథేచ్ఛగా సాగుతోంది. కూటమి నేతల కనుసన్నల్లో దందా నడుస్తోంది. ఈ క్రమంలోనే నది సమీపంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వరకు ఇసుకను తోడేయడంతో వర్షాకాలం సబ్‌స్టేషన్ కూలిపోయే ప్రమాదం పొంచి ఉంది. శనివారం ఈ మేరకు విద్యుత్‌శాఖ అధికారులు సబ్‌స్టేషన్ వద్ద పరిస్థితులను పరిశీలించి అవాక్కయ్యారు. ఇంత భారీ స్థాయిలో ఇసుకను తోడేస్తుంటే ఏం చేస్తున్నారని సిబ్బందిపై మండిపడ్డారు.

వైభవంగా మాతమ్మ తిరుణాళ్ల



సారె తీసుకువస్తున్న సర్పంచ్ భారతి, తిమ్మారెడ్డి

తిరుపతి రూరల్ : మండలంలోని సి.మల్లవరం పంచాయతీ కాలూరు కొత్త దళితవాడలో మాతమ్మ తిరుణాళ్లను వైభవంగా నిర్వహిస్తున్నారు. శనివారం ఈ మేరకు సర్పంచ్ మొక్కల భారతి, తిమ్మారెడ్డి దంపతులు సారె సమర్పించారు. జాతర నిర్వహణ ఖర్చులకు రూ.40 వేల విరాళం అందించారు.

త్వరలోనే ఎస్వీయూలో 'బుద్ధిస్ట్ కోర్సు'

తిరుపతి సిటీ : ఎస్వీయూలో త్వరలోనే బుద్ధిస్ట్ స్టడీస్ కోర్సును ప్రారంభించనున్నట్లు రిజిస్ట్రార్ భూపతి నాయుడు తెలిపారు. శనివారం శ్రీనివాసా ఆడిటోరియంలో బుద్ధునితో నా ప్రయాణం– అంబేడ్కర్ అనే అంశంపై నాటక ప్రదర్శన నిర్వహించారు. రిజిస్ట్రార్ జ్యోతి ప్రజ్వలన చేసి నాటికను ప్రారంభించారు.

టీడీపీ కార్యకర్తకు గాయాలు

రేణిగుంట: ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా తిరుపతి విమానాశ్రయం వద్ద శనివారం ఓ టీడీపీ కార్యకర్త గాయపడ్డాడు. బాబును చూసేందుకు వడమాల పేటకు చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యుడు వెంకటేశ్వరరావు ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. టర్మినల్ ఎదురుగా ఉన్న కాలువపై నడిచి వస్తుండగా కాలువపై ఉన్న బండ విరగడంతో ఆయన కాలువలో పడ్డాడు. దీంతో తీవ్రంగా గాయపడ్డాడు. అధికారులు అతన్ని దగ్గరలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

'వీక్ష'లో జర్మనీ సైంటిస్ట్



విద్యార్థులతో సాయిరామ్ తదితరులు

తిరుపతి సిటీ : బైరాగిపట్టెడలని వీక్ష ది స్కూల్‌ను జర్మనీకి చెందిన ఎనర్జీ సైంటిస్ట్ డాక్టర్ సాయిరామ్ శనివారం సందర్శించారు. ఆర్కే ఇన్‌స్టిట్యూషన్స్ చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి, డైరెక్టర్ ఆర్కే విమల, యోగా ట్రైనర్ శివాజీ పాల్గొన్నారు .

ఎస్వీయూలో..



ఎస్వీ జూనియర్ కళాశాలలో..



పాకాలలో..



ఎస్వీ మెడికల్ కళాశాలలో..



సమష్టిగా 'స్వచ్ఛత'

ప్రతి నెలా మూడో శనివారం నిర్వహించే స్వర్ణాంధ్ర– స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని శనివారం ఎస్వీయూ, ఎస్వీఆర్ట్స్, ఎస్వీ జూనియర్ కళాశాల, ఎస్వీ మెడికల్ కాలేజీ, పాకాలలో చేపట్టారు. ప్లాసిక్ వస్తువుల వినియోగం పర్యావరణానికి మంచిది కాదని వక్తలు తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. చెత్తాచెదారాలను తొలగించి తమ వంతు బాధ్యతను నిర్వర్తించారు. – తిరుపతి సిటీ / తిరుపతి తుడా / పాకాల

ఇదెక్కడి మోసం బాబోయ్!

'గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇచ్చిన మాట కంటే ఎక్కువ పథకాలు అందించారు. పేదలందరికీ పారదర్శకంగా సంక్షేమ ఫలాలు ఇంటి ముంగిటకే చేర్చారు. అయితే చంద్రబాబు బూటకపు హామీలు నమ్మాం.. గంపగుత్తగా కూటమికి ఓట్లేశాం.. ఇప్పుడు నిలువునా మునిగిపోయాం.. కేవలం అధికారంలోకి ఇదెక్కడి మోసం 'బాబోయ్' అని దిక్కుతోచక కొట్టుమిట్టాడుతున్నాం'' అంటూ నగర వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబు మేనిఫెస్టో మోసాలను వివరించేందుకు క్షేత్రస్థాయి పర్యటనకు వచ్చిన వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డితో తమ గోడు వెళ్లబోసుకున్నారు.

- ఏడాదిగా ఒక్క పథకం కూడా అమలు చేయలేదు
- ఓట్ల కోసం చంద్రకబాబు బూటకపు హామీలు గుప్పించారు
- మా ఇళ్లకు కూటమి నేతలు వస్తే చొక్కా పట్టుకుని నిలదీస్తాం
- భూమన అభినయ్‌రెడ్డితో మొరపెట్టుకున్న మహిళలు
- బాబు మేనిఫెస్టో మోసాలను వివరించిన అభినయ్



40వ డివిజన్‌లో చంద్రబాబు మోసాలను వివరిస్తున్న భూమన అభినయ్‌రెడ్డి



23వ డివిజన్‌లో ..

తిరుపతి మంగళం : చంద్రబాబు హామీలను నమ్మి పూర్తిగా మోసపోయామంటూ తిరుపతి నగర ప్రజలు వాపోతున్నారని వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి తెలిపారు. రీకాల్ చంద్రబాబు మోసాల మేనిఫెస్టోను శనివారం నగరంలోని 10, 13, 23, 28, 32, 40వ డివిజన్లలో ఇంటింటికీ వెళ్లి వివరించారు. ఎన్నికల్లో చంద్రబాబు ఇచ్చిన హామీలన్నీ అమలు అవుతున్నాయా..? తల్లికి వందనం, ఆడబిడ్డ నిధి, యాభై ఏళ్లు నిండిన మహిళలకు పెన్షన్, యువతకు ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఉచిత బస్సు వంటి సంక్షేమ పథకాలు వస్తున్నాయా? అంటూ స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యేను సంక్షేమ పథకాల గురించి అడిగారా? అని ప్రశ్నించారు. ఎన్నికల్లో ఓట్లు కోసం వచ్చారే తప్ప ఇప్పటి వరకు మా ఇళ్లకు గానీ, మా వీధికి గానీ వచ్చిన పాపాన పోలేదని స్థానికులు మండిపడ్డారు. గత ఎన్నికల్లో చంద్రబాబు మాటలను నమ్మి మోసపోయామని ఆగ్రహం వ్యక్తం చేశారు.

పేదల అభ్యున్నతే లక్ష్యం

ఎన్నికల్లో చంద్రబాబు అవి చేస్తా, ఇవి చేస్తానంటే ష్యూరిటీ ఇచ్చాడంటే కచ్చితంగా మోసం గ్యారంటీ అనే విషయాన్ని ప్రజలు గుర్తు పెట్టుకోవాలని భూమన అభినయ్‌రెడ్డి సూచించారు. చంద్రబాబుకు, జగనన్నకు నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా ఉందన్నారు. పేదల అభ్యున్నతే లక్ష్యంగా నిరంతరం పనిచేసే గొప్ప నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. గత ఎన్నికల్లో చంద్రబాబు ఇచ్చిన మేనిఫెస్టో హామీల ప్రకారం 13నెలలకు గానూ ఒక్కో ఇంటికి రూ. లక్ష నుంచి రూ. 2లక్షల వరకు అందించాల్సి ఉందని, అయితే ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని ఆరోపించారు. ఏడాది కాలంలో కూటమి నేతలు ఏదో ఉద్ధరించినట్లు తొలిఅడుగు పేరుతో వస్తున్నారని, అయితే వారేం చేశారో నిలదీయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి, కార్పొరేటర్లు రామస్వామి వెంకటేశ్వర్లు, లడ్డు భాస్కర్‌రెడ్డి, తమ్ముడు గణేష్, ఆదిలక్ష్మి, నేతలు రఘునాథరెడ్డి, మార్కెట్ గురువారెడ్డి, ఊతుకుంట మోహన్, మార్కెట్ రూపేష్‌రెడ్డి, పెరుగు బాబూయాదవ్, గోపాల్‌రెడ్డి, కల్లూరు చెంగయ్య, ఇరగం అనీల్‌రెడ్డి పాల్గొన్నారు.

షాడో పార్టీ నిఘా

ముఖ్యమంత్రి చంద్రబాబు తిరుపతి పర్యటన నేపథ్యంలో భూమన అభినయ్‌రెడ్డిపై పోలీసులు షాడో పార్టీతో నిఘా పెట్టారు. చంద్రబాబు పర్యటనను అడ్డుకుంటారేమో అని ఉదయం నుంచి సాయంత్రం వరకు అభినయ్ వెంటే ఐదుగురు పోలీసులు విధులు నిర్వర్తించడం గమనార్హం.

ఉర్దూ భాషాభివృద్ధికి కృషి

తిరుపతి కల్చరల్ : జిల్లాలో సమష్టి కృషితో ఉర్దూ భాషాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ప్రభుత్వ ఖాజీ, అంజుమన్ తరఖీ ఉర్దూ సంస్థ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ షఫీ అహ్మద్ ఖాద్రి తెలిపారు. శనివారం గిడ్డంగి వీధిలోని అంజుమన్ తరఖీ ఉర్దూ సంస్థ కార్యాలయంలో జిల్లా స్థాయి విస్తృత సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తిరుపతిలోని ఏటీఎస్ కళాశాలలో ఉర్దూ భాషతో కూడిన విద్యను ముస్లిం విద్యార్థులకు ఉచితంగా అందించడమే కాకుండా, మెటీరియల్‌ను సైతం ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. అనంతరం జిల్లా అడహక్ కమిటీతో పాటు తిరుపతి నగర నూతన కమిటీని ఎంపిక చేశారు. అడహక్ కమిటీ కన్వీనర్‌గా సయ్యద్ షఫీ అహ్మద్ ఖాద్రి, కో–కన్వీనర్లుగా షేక్ జాకీర్ హుస్సేన్, సభ్యులుగా పఠాన్ ఫరీద్, షేక్ బిరదా సాహెబ్, ఎండీ మాహీమ్, ఎస్ఆర్ రఫీ, ఎస్ఎస్ ఖాదరీ, ఎస్.అబ్దుల్ రతీఫ్. షేక్ సిరాజ్‌బాషా, ఎం.అబ్దుల్ షాజహాన్ బాషా నియమితులయ్యారు. గర కమిటీ అధ్యక్షుడిగా డాక్టర్ మొహిద్దీన్‌బాషా, ఉపాధ్యక్షుడిగా డాక్టర్ మొగల్ అమ్‌జద్ అలీబేగ్, కార్యదర్శిగా హాజీ షేక్ ఫరీద్ సాహెబ్, సహాయ కార్యదర్శిగా షేక్ చాంద్‌బాషా, కోశాధికారిగా ఎస్ఎస్ సాహి అమీన్‌తో పాటు 9 మంది కమిటీ సభ్యులను ఎంపిక చేశారు.



మాట్లాడుతున్న ప్రభుత్వ ఖాజీ

మతోన్మాదంపై పోరాటం


తిరుపతి కల్చరల్ : దేశంలో మితిమీరిన మతోన్మాదంపై ప్రజలను చైతన్యవంతం చేస్తూ పోరాటం సాగించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పి.హరనాథరెడ్డి పిలుపునిచ్చారు. సీపీఐ నగర మహాసభల్లో భాగంగా శనివారం గంధమనేని శివయ్య భవన్‌లో ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పెరియార్ పుస్తకం విక్రయించకూడదంటూ పుస్తక ప్రదర్శనపై మతోన్మాదులు దాడులు చేయడం దారుణమన్నారు. హిందూ మతోన్మాదులు అభ్యుదయ సాహిత్యంపై దాడులకు తెగబడుతున్నారని, కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు, అభ్యుదయ వాదులు, మేధావులు సమష్టిగా తిప్పి కొట్టాలని కోరారు. మోదీ విషపూరిత విధానాలకు చంద్రబాబు, పవన్ కల్యాణ్ అండగా నిలుస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రానికి రావాల్సి హక్కులను అడగకుండా యోగా డే పేరుతో రూ.300 కోట్లు దుర్వినియోగం చేశారని విమర్శించారు. సూపర్ సిక్స్ హామీలను అమలు చేయడంలో చంద్రబాబు వైఫల్యం చెందారని స్పష్టం చేశారు. నేతలు రామానాయుడు, పి.మురళి, పెంచలయ్య, విశ్వనాథ్, ఉదయ్‌కుమార్, నదియా, గుర్రప్ప, నాగరాజు, చారులత, హరిబాబు, నాగభూషణం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ నేత హరనాథ్‌రెడ్డి

సబ్‌జైలు తనిఖీ

తిరుపతి లీగల్: తిరుపతి ఎర్రచందనం కేసుల విచారణ జూనియర్ సివిల్ జడ్జ్ శ్రీకాంత్ శనివారం నగరంలోని సబ్ జైలును తనిఖీ చేశారు. ఖైదీలకు పంపిణీ చేస్తున్న ఆహారం, కల్పిస్తున్న వసతులపై ఆరా తీశారు. వంటశాల, పరిసరాలను పరిశీలించారు. కార్యక్రమంలో సబ్ జైలు సూపరిండెంట్ రామకృష్ణ యాదవ్, న్యాయవాది మనోజ్ కుమార్ పాల్గొన్నారు.



సూచనలిస్తున్న జడ్జి శ్రీకాంత్

వైఎస్సార్‌సీపీ నేత కుటుంబీకులకు పరామర్శ



పరామర్శిస్తున్న అభినయ్‌రెడ్డి

తిరుపతి మంగళం : నగరంలోని 19వ వార్డుకు చెందిన వైఎస్సార్‌సీపీ నేత నాగయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న పార్టీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి శనివారం వారి నివాసానికి వెళ్లి నాగయ్య కుటుంబీకులను పరామర్శించారు. కార్పొరేటర్ ఆరణి సంధ్య, నేతలు సద్దా బాబూయాదవ్, పడమటి కుమార్, మల్లం రవికుమార్‌రెడ్డి, అరికెల సోమశేఖర్ పాల్గొన్నారు.

ఘనంగా తిరువడిపురం ఉత్సవం



ఊరేగుతున్న అమ్మవారు

తిరుపతి కల్చరల్ : శ్రీగోవిందరాజస్వామి వారి ఆలయంలో శనివారం ఆండాళ్ అమ్మవారి తిరువడిపురం ఉత్సవం ఘనంగా ప్రారంభమైంది. 28వ తేదీ వరకు ఆలయంలో ఈ ఉత్సవం జరుగనుంది. ఇందులో భాగంగా ఉదయం 6 గంటలకు అమ్మవారికి తిరుమంజనం జరిపించారు. సాయంత్రం ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగింపు చేపట్టారు. ఆలయ డిప్యూటీ ఈఓ వీఆర్ శాంతి, ఏఈఓ భాస్కర నారాయణ చౌదరి పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న న్యాయమూర్తి అన్వర్‌బాషా

తిరుపతి లీగల్ : భూసేకరణ చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని రాయలసీమ జిల్లాల భూసేకరణ కోర్టు న్యాయమూర్తి అన్వర్‌బాషా తెలిపారు శనివారం తిరుపతి బాలాజీ కాలనీ సమీపంలోని భూసేకరణ కోర్టు హాల్‌లో న్యాయవాదులు, రెవెన్యూ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. భూసేకరణ చట్టం 2013 ప్రకారం బాధితులకు పరిహారం ఎలా అందించాలి , కోర్టులో ఫిర్యాదు ఎలా దాఖలు చేయాలి అనే అంశాలపై అవగాహన ప్రభుత్వ న్యాయవాది ఆదినారాయణ, న్యాయవాదులు నరహరరెడ్డి యోగానంద్ దేవరాజులు హరిప్రసాద్ రెడ్డి కోర్టు సూపరింటెండెంట్ ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

పవిత్రోత్సవాలకు అంకురార్పణ

తిరుపతి కల్చరల్ : శ్రీకోదండరామస్వామి వారి ఆలయంలో 22వ తేదీ వరకు నిర్వహించనున్న పవిత్రోత్సవాలకు ఆదివారం సాయంత్రం శాస్త్రోక్తంగా అంకురార్పణ చేపట్టారు. ఈ సందర్భంగా సేనాధిపతి ఉత్సవం, మేదిని పూజ, మృత్సంగ్రహణం, అంకురార్పణ ఘట్టాలు జరిపించారు. ఆలయ డిప్యూటీ ఈఓ నాగరత్న, ఏఈఓ రవి పాల్గొన్నారు.

నోటీస్ బోర్డు

- శ్రీగోవిందరాజస్వామి ఆలయంలో ఆండాళ్ అమ్మవారి తిరువడిపురం ఉత్సవంలో భాగంగా ఉదయం 6 గంటలకు తిరుమంజనం, సాయంత్రం 5.30 గంటలకు ఊరేగింపు.
- బీఎస్ఐ సంస్థ ఆధ్వర్యంలో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కరకంబాడి రోడ్డులోని ఆశ కన్వెన్షన్ సెంటర్‌లో కాన్‌క్లేవ్-2.0.
- వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు 49వ వార్డు, 11 గంటలకు 32 వార్డు, 11.30 గంటలకు 24వ వార్డు, సాయంత్రం 5 గంటలకు శెట్టిపల్లె, 5.30 గంటలకు ఉప్పరిపాళెం, 6.30 గంటలకు దాసరిమఠంలో ఇంటింటికి చంద్రబాబు మోసం– రీకాలింగ్ బాబు మేనిఫెస్టో కార్యక్రమం.
- ఇంటర్నేషనల్ దళిత్ జర్నలిస్ట్ నెట్వర్క్ ఆధ్వర్యంలో ఉదయం 10.30 గంటలకు ప్రతిభా పురస్కారాల ప్రధానోత్సవం.
- శ్రీకోదండరామస్వామి వారి ఆలయం పవిత్రోత్సవాల్లో భాగంగా తొలిరోజు ఉదయం 10 గంటలకు యాగశాలలో వైదిక కార్యక్రమాలు, పవిత్ర ప్రతిష్ఠ.
- అభినయ ఆర్ట్స్ జాతీయ నాటక పోటీలలో భాగంగా మహతి కళాక్షేత్రంలో ఉదయం 9 గంటలకు శాస్త్రీయ, జానపద నృత్యాలు, సాయంత్రం 4 గంటలకు 'జగదేక సుందరి సామా' పద్యనాటకం, 6.30 గంటలకు 'విడాకులు కావాలి' రాత్రి 8 గంటలకు 'ఆచమనం' సాంఘిక నాటికల ప్రదర్శన.

ఎస్‌బీ డీఎస్పీగా వెంకటనారాయణ

తిరుపతి క్రైమ్ : తిరుపతి స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీగా వెంకటనారాయణ నియమిస్తూ డీజీపీ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఇక్కడ పని చేస్తున్న గిరిధర్ను డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేసుకోవాలని పేర్కొన్నారు. వీఆర్లో ఉన్న వెంకటనారాయణ త్వరలో డీఎస్పీగా బాధ్యతలు చేపట్టనున్నారు.

నాటకోత్సవాలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న అతిథులు

తిరుపతి కల్చరల్ : అభినయ ఆర్ట్స్ రజతోత్సవాల్లో భాగంగా ఈనెల 27వ తేదీ వరకు తలపెట్టిన హనుమ అవార్డ్స్ జాతీయ నాటక పోటీలు శనివారం మహతి కళాక్షేత్రంలో వేడుకగా ప్రారంభమయ్యాయి. అన్నమాచార్య ప్రాజెక్టు ప్రత్యేకాధికారి డాక్టర్ మేడసాని మోహన్, రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి అతిథులుగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. మేడసాని మోహన్ మాట్లాడుతూ కళా సంపదను పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. గత 25 ఏళ్లుగా అభినయ ఆర్ట్స్‌వారు కళామతల్లికి అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. పోటీలలో భాగంగా కళాకారులు ప్రదర్శించిన శాస్త్రీయ, జానపద బృంద నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం కళాకారులను అభినయ ఆర్ట్స్ కార్యదర్శి బీఎస్.రెడ్డి జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు.

పార్టీ బలోపేతమే లక్ష్యం



మోహిత్‌రెడ్డిని సత్కరిస్తున్న నేతలు

తిరుపతి రూరల్ : వైఎస్సార్‌సీపీ జిల్లా విద్యార్థి విభాగం కార్యదర్శి, కార్యవర్గ సభ్యుడిగా అవకాశం ఇచ్చినందుకు పార్టీ బలోపేతమే లక్ష్యంగా చిత్తశుద్ధితో పనిచేస్తామని ప్రదీప్‌కుమార్, పార్థసారథిరెడ్డి తెలిపారు. శనివారం ఈ మేరకు తుమ్మలగుంటలోని నివాసంలో వైఎస్సార్‌సీపీ చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని కృతజ్ఞతలు తెలిపారు. తమకు పదవి ఇప్పించినందుకు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో పేరూరు సర్పంచ్ దామినేటి కేశవులు, విద్యార్థి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ బి.ఓబుల్ రెడ్డి, నేతలు విజయ్ కుమార్, అశోక్ , శివ ,ముబారక్ , జగన్ రెడ్డి , చరణ్ రెడ్డి , ఓం ప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు.

ఎలక్ట్రిక్ రైలు పైకి దూకి వ్యక్తి ఆత్మహత్యాయత్నం

కొరుక్కుపేట: తిరుపతిలోని పీటీఆర్ కాలనీకి చెందిన శేఖర్ (37) అనే వ్యక్తి చెన్నై తాంబరం ఫ్లైఓవర్ నుంచి మూడవ ప్లాట్‌ఫాంపై నిలబడి ఉన్న ఎలక్ట్రిక్ రైలుపైకి దూకాడు. దీంతో విద్యుదాఘాతం తగిలి మంటలు అంటుకున్నాయి. రైల్వే పోలీసులు వెంటనే చెన్నైలోని రాజీవ్ గాంధీ ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రిలో చేర్పించారు. ఆన్‌లైన్‌లో రమ్మీలో రూ.2 లక్షలు పోగొట్టుకుని ఆత్మహత్యకు యత్నించినట్లు తెలిసింది.

చెట్టు కింద చదువులు!

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో విద్యావిప్లవానికి నాంది పలికారు. నాడు–నేడు కింద సర్కారు బడుల్లో అద్భుతంగా మౌలిక వసతులు కల్పించారు. అయితే కూటమి పాలనలో పేద పిల్లలు నానా ఇక్కట్లు పడుతున్నారు. స్కూళ్ల విలీన ప్రక్రియ కారణంగా చాలీచాలని సౌకర్యాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చివరకు చెట్ల కింద కూర్చుని చదువుకోవాల్సిన దుస్థితిలో అవస్థలు పడుతున్నారు. ఈ క్రమంలోనే రామచంద్రాపురం మండలం అనుప్పల్లి ప్రాథమిక పాఠశాలలో ఆరుబయట నిర్వహిస్తున్న తరగతుల్లో విద్యాభ్యాసం చేస్తున్నారు.

- విలీన ప్రక్రియ కారణంగా విద్యార్థులకు ఇక్కట్లు
- ప్రాథమిక పాఠశాలలో సరిపోని గదులు
- ఆరుబయట నిర్వహిస్తున్న తరగతులు



పాఠశాలకు ఆటోలో వెళుతున్న విద్యార్థులు



ఆరు బయట కూర్చున్న పిల్లలు

రామచంద్రాపురం : రాష్ట్ర వ్యాప్తంగా విద్యావ్యవస్థలో సమూల మార్పులు తీసుకువచ్చామని, కార్పొరేట్‌కు దీటుగా సర్కారు బడులను తీర్చిదిద్దుతున్నామంటూ మంత్రి నారా లోకేష్ ఆర్భాటంగా ప్రకటించారు. అయితే అవన్నీ కాగితాలే పరిమితమవుతున్నట్లు పలువురు విద్యావేత్తలు ఆరోపిస్తున్నారు. అందులో భాగంగా ఓ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చెట్టు కింద నేలపై కూర్చోబెట్టి కొద్ది రోజులుగా పాఠ్యాంశాలు బోధిస్తున్న విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. . వివరాలు.. రామచంద్రాపురం మండలం గోకులాపురం, ఉప్పలవంకలోని ప్రాథమిక పాఠశాలలో గతంలో 5వ తరగతి వరకు నిర్వహించేవారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బడుల విలీనం పేరుతో మోడల్ స్కూల్‌గా మార్పు చేసి 1, 2వ తరగతులకు మాత్రమే పరిమితం చేశారు. మిగిలిన తరగతులకు చెందిన సుమారు 40 మంది విద్యార్థులను అనుప్పల్లె ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు తరలించారు. అయితే ఆ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు లేకపోవడంతో గదులు చాలడం లేదు. ఫలితంగా విద్యార్థులను పాఠశాల ఆవరణలో చెట్టు కింద నేలపై కూర్చోబెట్టి పాఠాలు చెబుతున్నారు.

తల్లిదండ్రుల ఆగ్రహం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రైవేట్ స్కూళ్లతో పోటీ పడే స్థాయికి సర్కారు బడులను తీసుకువచ్చిన విషయం విధితమే. అయితే చంద్రబాబు సర్కారు ఏళ్ల నాటి దుస్థితికి బడులను తీసుకువచ్చిందని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆన్‌లైన్ బదిలీలతో అనుపల్లె ప్రాథమిక పాఠశాలకు తమ పిల్లలను తరలించడంపై మండిపడుతున్నారు. అక్కడ ఉపాధ్యాయులు కూడా పరిమితంగా ఉండడంతో విద్యార్థులకు పూర్తిస్థాయిలో పాఠ్యాంశాలు బోధించే పరిస్థితి లేదని వాపోతున్నారు. ఎండలు, వర్షాలకు పిల్లలు ఇబ్బందులు ఎదుర్కొంటారని ఆందోళన చెందుతున్నారు. రహదారికి ఆనుకుని పాఠశాల ఉండడంతో దుమ్ము, ధూళికి రోగాల బారిన పడే ప్రమాదం పొంచి ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదివరకటి పాఠశాలలో పక్కాగా మౌలిక వసతులు ఉన్నప్పటికీ విలీనం పేరుతో పిల్లలను అనుప్పల్లెకు పంపడం సరికాదని స్పష్టం చేస్తున్నారు. అలాగే ఇంటి నుంచి పాఠశాలకు వెళ్లి వచ్చేందుకు పిల్లలను ఆటోల్లో పంపించాల్సి వస్తోందని, దీంతో తమపై ఆర్థిక భారం పడుతోందని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు స్పందించి విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.